ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా
జిల్లా వార్తలు

శనివారం 8 జూలై 2023






జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న కేంద్ర భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వశాఖ మంత్రి కిరణ్ రిజిజు

# దేశ జీడీపీలో మత్స్య ఉత్పత్తులే కీలకం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**మచిలీపట్నం టౌన్, జూలై 7 :** భారతదేశ జీడీపీ మెరుగుదలలో మత్స్య ఉత్పత్తుల రంగం ప్రధానమైందని కేంద్ర భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా సముద్ర సమాచార వ్యవస్థల భారత జాతీయ కేంద్రం ఆధ్వర్యంలో సముద్ర సమాచారం, సలహాల సేవలపై జిల్లాలోని మత్స్యకారులకు శుక్రవారం మచిలీపట్నం రెవెన్యూ కళ్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు జ్యోతి ప్రకాశనం చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. మత్స్యకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గల పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, సముద్ర సమాచార వ్యవస్థలపై హైదరాబాద్ కేంద్రం మత్స్యకారులకు సలహాలు అందిస్తోందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ల ద్వారా నేరుగా సమాచారాన్ని చేరవేసే విధంగా సమాచార వ్యవస్థను రూపొందించామన్నారు. చేపలు సమృద్ధిగా దొరికే ప్రాంతాలను తెలుసుకోవడం ద్వారా సమయం, ఇంధనం, డబ్బు, మానవశక్తి ఆదా అవుతుందన్నారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ, మచిలీపట్నం షిప్పింగ్ హార్బరు నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు. బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, మచిలీపట్నంలో రీజనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మత్స్యకార సంఘాల నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ, మొబైల్ యాప్ ద్వారా మత్స్యకారులకు ఇచ్చే సమాచారాన్ని అందిపుచ్చుకోవాలన్నారు.